క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

రేపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఈ నెల 26వతేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తెనాలికి చెందిన హ్యాపీ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల వారు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నారని రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్, ఆయాసం, చెవి, ముక్కు, గొంతు సమస్యలకు, క్యాన్సర్ సమస్యలకు, ఎముకలకు సంబంధించిన సమస్యలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ఝాన్సీలక్ష్మికి డాక్టరేట్



రేపల్లె: మదర్‌థెరిస్సా యునెస్కో క్లబ్ అధ్యక్షురాలు, విశ్రాంత హెచ్‌ఎం ఎ.ఝాన్సీలక్ష్మి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. రేపల్లె మండలంలోని పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళల పాత్ర అనే అంశంపై నిర్వహించిన పరిశోధన పత్రానికి ఆమెకు డాక్టరేట్ అందింది. ఈ సందర్భంగా ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

చిరుధాన్యాలతో చక్కటి ఆరోగ్యం



జంపని(వేమూరు): అందరూ చిరు ధాన్యాలు వినియోగించి, చక్కటి ఆరోగ్యం కలిగి ఉండాలని అమర్తలూరు శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని జంపని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార పక్షోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల తల్లులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలలో మంచి పౌష్టికాహారం ఉంటుందన్నారు. అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయరాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శాంతి శ్రీ, రమణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థల వివాదంపై కేసు

భట్టిప్రోలు: స్థల వివాదం పెద్దల సమక్షంలో పరిష్కారం కాకపోవడంతో బాధితురాలు భట్టిప్రోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే భట్టిప్రోలు మండలం ఐలవరంకు చెందిన పప్పుల ఎస్తేరు, గాలి రాఘవమ్మలు ఇంటి స్థలం విషయంలో ఘర్షణ పడ్డారు. దీనిపై పెద్దల సమక్షంలో పరిష్కారం కాకపోవడంతో బాధితురాలు ఎస్తేరు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శ్రీనివాసరావు(ఫైల్)

కర్లపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్‌ఐ ఎం.శివయ్య తెలిపిన వివరాల మేరకు కర్లపాలెం మండలం నల్లమోతు వారిపాలెం పంచాయతీ వెన్నెలకంటి నగర్‌కు చెందిన చేవూరి శ్రీనివాసరావు (38) ఈనెల 17వ తేదీన బైక్‌పై తెనాలి వెళ్లి తిరిగి తమ గ్రామానికి వస్తుండగా యాజలి సెంటర్ సమీపంలోకి రాగానే పుచ్చకుర్తివారిపాలెం రహదారి నుంచి జాతీయ రహదారి పైకి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంతో శ్రీనివాసరావు బైకును ఢీకొట్టాడని ఎస్‌ఐ తెలిపారు. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు రోడ్డుపై పడిపోవటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని 108 వాహనం ద్వారా గుంటూరు జీజీహెచ్‌కు తరలించటం జరిగిందన్నారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు శనివారం ఉదయం మృతిచెందటంతో అతని భౌతికకాయానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించటం జరిగిందన్నారు. మృతునికి భార్య సుభాషిని, కుమారుడు, కుమార్తె ఉన్నారని కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అమర్తలూరు(వేమూరు): పాము కాటు వల్ల మృతి చెందిన కుటుంబానికి ఆర్థికంగా ఆదుకోవడం జరిగిందని మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్ తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలోని కొమరగిరి అంకమ్మ పాముకాటుతో ఇటీవల మృతి చెందింది. ఆమె కుమార్తె కొమరగిరి పోలమ్మ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండడంతో రూ.6 వేల ఆర్థిక సహాయం అందించామన్నారు. గోవాడ గ్రామంలో అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసర వస్తువులను కై తేపల్లి రాంబాబు అందజేశారు. మాజీ సర్పంచి కూచిపూడి సతీష్, ఇంటూరు భాస్కర్, లాం హరనాథ్‌బాబు, అత్తోట రమేష్, చేకూరి నరేంద్ర పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

మంగళగిరి: నగరంలోని ఆటోనగర్ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ పోలీసులు శనివారం తెలిపారు. మృతుడి వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందని, బ్లూ కలర్ నైట్ ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి వివరాలు తెలిసిన వారు సమాచారాన్ని అందించాలని పట్టణ పోలీసులు కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- పెరవలిలో గడప గడపకు మన ప్రభుత్వం



పెరవలిలో సంక్షేమ పథకాల అమలు తీరు గురించి తెలుసుకుంటున్న మంత్రి మేరుగ నాగార్జున

పెరవలి(వేమూరు): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. వేమూరు మండలంలోని పెరవలి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రతి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాది వెంకట లక్ష్మీరాజ్యం, దాది సుబ్బారావు, ఎంపీటీసీ దాది రజని, కాకులేశ్వరరావు, యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, పట్టిల రంగబాబు, జొన్న కూటి వెంకట నారాయణ, మాజీ సర్పంచి దాసరి పోతురాజు, విష్ణుమొలకల వెంకటేశ్వరరావు, బండారు శివయ్య, గుమ్మడి సత్యనారాయణ, గుమ్మడి చిన్న, గాజులు భాను ప్రకాశ్, గాజుల మోహన్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు విష్ణుమొలకల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాసరి మోహనరావు, మాజీ ఎంపీపీ బొల్లి శెట్టి ప్రభాకరావు, ఆలపర్తి రవి కుమార్, రాంబాబు, దున్నా మేరీసుబాబు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలతో వ్యాధులు దూరం

డీజీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీజీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి

నిజాంపట్నం: నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకి తప్పనిసరిగా టీకా వేయించాలని డీజీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్ తెలిపారు. మండలంలోని అడవులదీవి పశువైద్యశాలలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా పశువులకు గాలికుంటువ్యాధి టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పశువుల సంరక్షణ కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలలని కోరారు. పశువు గుర్తింపు కార్డును చెవిపోగుకి తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. సర్పంచి శొంఠి శ్రీనివాసరావు మాట్లాడుతూ పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా పశుపోషకులు వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఎంపీటీసీ మేకా రాజేష్ కన్నా, పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ హేమప్రియ, ఎల్ఎస్ఏ విజయలక్ష్మి, పెనుమూడి నరేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వీరంకి ముక్తేశ్వరరావు, రైతుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓలేరు, ఐలవరంలలో..

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని గుత్తావారిపాలెం, భట్టిప్రోలు పశువైద్యశాల ఆధ్వర్యంలో ఐలవరం ఆర్బీకేలలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలను ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరిలు ప్రారంభించారు. ఆయా గ్రామ సర్పంచులు మేరుగ రంగారావు, మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు నీలా సాంబమ్మ, మురుగుడు శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. పశువైద్యులు డాక్టర్ రోషన్ బేగ్, డాక్టర్ బొర్రా లక్ష్మి రంజితలు మాట్లాడుతూ 31వ విడత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు శనివారం నుంచి ఏప్రిల్ 24వ తేదీవరకు పశువులకు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. సిబ్బంది షేక్ హమద్ ఆలి, బి.లక్ష్మయ్య, జెవీ గోపికృష్ణ, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

పెనుమూడిలో...

రేపల్లె: పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని సర్పంచి దారం విజయ్ అన్నారు. మండలంలోని పెనుమూడి గ్రామంలో శనివారం నిర్వహించిన పశువైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి అనంతరం మాట్లాడారు. పశువులు గాలికుంటు వ్యాధుల బారిన పడకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఈ వ్యాధి నివారణకై ఈ నెల 25వ తేదీ నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు 4 నెలల వయస్సు దాటిన దూడల నుంచి ప్రతి పశువుకు, అదేవిధంగా 8 నెలలున్న చూడి గేదెలకు టీకాలు అందించటం జరుగుతుందన్నారు. రేపల్లె ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు జి.నరేంద్ర పర్యవేక్షణలో పశువైద్యులు ఎ.ప్రవీణ్ కుమార్, మీనాక్షిదేవిలు 100 పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందజేశారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు, ఏహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

చదలవాడ(వేమూరు): రైతులు పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని పెదరావూరు వెటర్నరీ డీడీ డాక్టర్ వై.కేదారేశ్వర్ చెప్పారు. వేమూరు మండలంలోని చదలవాడ గ్రామంలో పశువైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచి దాసరి రమేష్ శనివారం ప్రారంభించారు. వేమూరు వెటర్నరీ హాస్పటల్ అసిస్టెంట్ డైరెక్టర్ కేవీ జనార్ధనరావు, గ్రామీణ పశు వైద్యులు నాగ సాయి పాల్గొన్నారు.

ఏట్రవారిపాలెంలో...

ఏట్రవారిపాలెం(కర్లపాలెం): పశువులకు వచ్చే వ్యాధులకు సకాలంలో వైద్యం చేయించాలని కర్లపాలెం పశువైద్యాధికారి ఎం.రేచల్ దివ్య తెలిపారు. ఏట్రవారిపాలెంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచి చీరాల వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఈ శిబిరంలో పశువైద్యాధికారి రేచల్ దివ్య సుమారు 200 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. బుద్ధాం లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పి.రాజేష్, గ్రామ పశు సహాయకులు రహమతున్నీసా, బి.నవీన్‌కుమార్, గోపాలమిత్రలు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పరీక్ష సామగ్రిని పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ విజయసారథి

రేపల్లె: విద్యార్థులు పబ్లిక్ పరీక్షలలో ఎటువంటి మానసిక ఒత్తిడిలకు గురికాకుండా ఉత్తమ ఫలితాలు సాధించాలని మున్సిపల్ కమిషనర్ విజయసారథి అన్నారు. 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్న నేపథ్యంలో పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఆంధ్రరత్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పరీక్ష సామగ్రి పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరీక్షలు రాసే సమయంలో మానసిక స్థైర్యం కలిగి ఉండాలని సూచించారు. అనంతరం 35 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రవీణ, ఆదర్శ వేదిక కన్వీనర్ కిషోర్, సభ్యులు నటరాజ్, బోస్, సాయికృష్ణమాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: పదవ తరగతి విద్యార్థులు పది పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించాలని గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేమ్ రాజు ఆకాంక్షించారు. శనివారం భట్టిప్రోలు మండలంలో దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్, వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షల మెటీరియల్ కిట్లను అందచేశారు. హెచ్‌ఎంలు షేక్ మహబూబ్‌బాషా, కనపర్తి నిరీక్షణరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ చెన్ను సాంబశివరావు, గ్రేస్ ఫౌండేషన్ సభ్యులు యన్నం సురేష్, క్రాప నాని, యలమాటి దాసు, కంభం సురేష్, వి.గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



చుండూరు(భట్టిప్రోలు): వైఎస్సార్ ఆసరా రుణమాఫీ మూడవ విడత కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మల ఖాతాలలో నగదును శనివారం నేరుగా జమ చేయడంతో చుండూరు మండలం చినపరిమిలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గ్రామంలోని 63 గ్రూపులకు రూ.45,18,549లు లబ్ధి చేకూరింది. ఈ కార్యక్రమంలో గ్రామైఖ్య సంఘం ప్రెసిడెంట్ మేరుగ సుభాషిణి, యూఓఎస్ అవుతు అమృత కుమారి, పులివర్తి అరుణ కుమారి, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు

ఎన్‌ఎంఎంఎస్‌లో సత్తాచాటిన ఐలవరం విద్యార్థులు



విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

భట్టిప్రోలు: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు భట్టిప్రోలు మండలంలోని ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు వేమూరు నియోజకవర్గ స్థాయిలో 6 సీట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఫిబ్రవరి 5వ తేదీన జాతీయ స్థాయిలో జరిగిన పరీక్షకు అత్యధిక సంఖ్యలో విద్యార్థులను పంపడమే కాక నియోజకవర్గస్థాయిలో అధిక సంఖ్యలో స్కాలర్‌షిప్‌లను సాధించినట్లు హెచ్‌ఎం కాటూరి లక్ష్మీనారాయణ తెలిపారు. స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించిన వేమవరపు లక్ష్మణ్, పంచుమర్తి కుసుమశ్రీ, వాకా శృతిహాసిని, కొతరపు కుంకుమరాగ నందిని, కొండా జ్యోతిష్, గుంటి దీప్తి నాగ కౌసల్యలను శనివారం హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు పొన్నపల్లి రవిరామకిషోర్, ఉద్దంటి నారాయణ, అద్దంకి వెంకటేశ్వర్లు, బడుగు శివప్రసాద్, వేదాంతం బదరీనాథ్‌లను కూడా అభినందించారు. ఈ సీట్లు సాధించిన విద్యార్థులకు ఏటా రూ. 12 వేలు చొప్పున నాలుగేళ్లపాటు వారి ఖాతాల్లో జమ అవుతాయని హెచ్‌ఎం చెప్పారు.

సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీపీఎం వాణిశ్రీ

పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని జడ్‌బీఎన్‌ఎఫ్ బాపట్ల జిల్లా డీపీఎం వాణిశ్రీ తెలిపారు. మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంలో ఘన జీవామృతంతో విత్తన శుద్ధి చేయడం వలన మొక్కల్లో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు మొలక శాతం పెరుగుతుందని తెలిపారు. వేసవిలో పొలాలను బీడుగా ఉంచకుండా నవధాన్యాలను చల్లుకోవాలని తెలిపారు. అవి బెట్ట పరిస్థితులను తట్టుకుని తొలకరి వర్షాలు కురిసిన వెంటనే విత్తనం మొలకెత్తుతుందని తెలిపారు. సాగు, నేలతల్లి బాగు అనే అంశంపై విత్తన గుళికలు తయారు చేసి రైతులకు వివరించాలని సూచించారు. సుస్థిర సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ఈవిధానం పాటించేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. జెడ్‌బీఎన్‌ఎఫ్ ఆక్టివిస్ట్ వరదానం, లక్ష్మి, సౌజన్య, ప్రవళిక, సిబ్బంది రైతులు ఉన్నారు.

5న జరిగే పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మణిలాల్, ఉమామహేశ్వరరావు

బాపట్ల అర్బన్: కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5 ఢిల్లీలో జరగనున్న కార్మిక-కర్షకుల పోరాట ప్రదర్శన జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ బాపట్ల జిల్లా కార్యాలయంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.మణిలాల్ అధ్యక్షతన సమావేశం జరిగింది. రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు, రైతులు, ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రధాని మోదీ ధనవంతులైన అదానీ, అంబానీ వంటి వారి సేవలో మునిగి పోయారన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రజా సమస్యలను గాలికొదిలేశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మికులు, రైతాంగం హక్కులను రక్షించాలంటూ ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక-కర్షక పోరాట ప్రదర్శనలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.మణిలాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.మజుందార్, జిల్లా ఉపాధ్యక్షుడు సి.హెచ్.గంగయ్య, జి.సుధకార్, పి.రేఖ ఎలిజిత్, కె.లక్ష్మి పాల్గొన్నారు.

'దళిత క్రైస్తవులను ఎస్సీల్లో' తీర్మానంపై హర్షం



బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి, హర్షం వ్యక్తం చేస్తున్న ఎస్సీ నాయకులు

కర్లపాలెం: దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయటం హర్షనీయమని అంబేడ్కర్ యువజన సేవా సమాఖ్య మండల గౌరవ అధ్యక్షుడు మందపాటి పరమానందకుమార్ తెలిపారు. శనివారం ఎస్సీ నాయకులు కర్లపాలెం సెంటర్‌లోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చటానికి అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు సీఎం జగన్‌కు, స్థానిక ఎమ్మెల్యే కోన రఘుపతికి ధన్యవాదాలు తెలిపారు. పరమానందకుమార్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చాలని గత 40ఏళ్లుగా కోరుతున్నప్పటికీ గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని సీఎం జగన్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ నాయకులు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కాగిత బుల్లియ్య, మేకల సుబ్బారావు, గొర్రుముచ్చు మీరయ్య, కూచిపూడి శ్యామ్యూల్ జాన్, కాగిత ఆనందబాబు, చిక్కాల సాగర్, మార్పు బెనర్జి, సలగల ధర్మేంద్ర, కాగిత డేవిడ్, తాతపూడి మనోహర్, మహిళలు పాల్గొన్నారు.

ఆ గానం.. సమ్మోహనం

తెనాలి: పట్టణంలో బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలోని కళావేదికపై శనివారం సాయంత్రం చెన్నైకు చెందిన ప్రముఖ వర్ధమాన గాయకుడు అనిరుథ్ గానం సంగీతాభిమానులను సమ్మోహనపరిచింది. దాదాపు రెండు గంటల సేపు శాస్త్రీయ, సినీ గీతాలను జనరంజకంగా ఆలపించారు. కీబోర్డుపై జి.సాయి (గుంటూరు), తబలాపై పి.రమణ (గుంటూరు) వాద్య సహకారం అందించారు. రామలింగేశ్వర భక్త సమాజం, ఆంధ్రాప్యారిస్ అకాడమీ, తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో ఈ భక్తి సంగీత విభావరిని నిర్వహించారు. పరుచూరు సుబ్బారావు, కొండపి వసుంధర, కొండపి శ్రీనివాసరావు, లక్కరాజు లక్ష్మణరావు, టీవీఎస్ శాస్త్రి, శంకర్‌రాజు, శ్రీనివాసరావు, పానుకుమాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కానూరు వెంకట రామకృష్ణ పర్యవేక్షించారు.

ఘనంగా బాపట్ల పాలిటెక్నిక్ కాలేజీ వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సుబ్రహ్మణ్యం, ఎం.శ్రీనివాసరావు

బాపట్ల అర్బన్: విద్యార్థులు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కుమార్ పంప్స్ మేనేజింగ్ డైరెక్టర్ కొత్త సుబ్రహ్మణ్యం అన్నారు. బాపట్ల పాలిటెక్నిక్ కాలేజీ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను ప్రతి విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా మారటానికి కావలసిన సహకారాన్ని అందించడానికి ఎల్లప్పుడు ముందుంటామన్నారు. వైస్ ప్రెసిడెంట్ దొప్పలపూడి రామ్మోహన్‌రావు, సెక్రటరీ మానం నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ టి.రాజేంద్రప్రసాద్‌లు మాట్లాడారు. క్రీడలలో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. వైస్ ప్రెసిడెంట్ గిల్లి దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ కొమ్మినేని హరిపద్మ ప్రసాద్, ట్రెజరర్ టి.రామకృష్ణ, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్

బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి



మాట్లాడుతున్న బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి

పిట్టలవానిపాలెం: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉన్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి తెలిపారు. మండలంలోని ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా ప్రారంభించబడిన సంకల్పం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా సంకల్పం కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులు డ్రగ్స్ వినియోగించడం వలన కలిగే దుష్ఫలితాలు, చట్టపరమైన చర్యలు శిక్షలు, డ్రగ్స్ వ్యసనం నుంచి ఎలా బయట పడాలి తదితర అంశాలపై కల్పించారు. ఎక్కడైనా ఎవరైనా మాదక ద్రవ్యాలు, గంజాయి విక్రయిస్తున్న, సేవిస్తున్నారన్న సమాచారం తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. చందోలు ఎస్‌ఐ రాజశేఖర్, కళాశాల యాజమాన్యం ఉన్నారు.

ముగిసిన పోలేరమ్మ వార్షిక కొలుపులు



ప్రత్యేక అలంకరణలో ఉన్న పోలేరమ్మ అమ్మవారు

పాతనందాయపాలెం(కర్లపాలెం): గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి ఆలయ ఎనిమిదో వార్షిక కొలుపులు గత ఐదు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. గ్రామపెద్దలు ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వార్షికోత్సవ కొలుపులలో ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొని అమ్మవారి పూజలు నిర్వహించి అన్న ప్రసాదాలను స్వీకరించారు. కొలుపులు ముగింపులో భాగంగా గ్రామంలోని మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి ఆలయానికి వచ్చి ప్రదక్షిణలు చేశారు. సుమారుగా 2వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు. సర్పంచి కావూరి చిట్టెమ్మ, వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీపీ యారం వనజ, వైఎస్సార్ సీపీ నాయకులు తాండ్ర సాంబశివరావు, కావూరి శ్రీనివాసరెడ్డి, అక్కల రమణారెడ్డి, రత్నారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు అక్కల గోపిరెడ్డి, కుంచాల నాగబాబురెడ్డి, సూర్యనారాయణరెడ్డి, పెదనాగిరెడ్డి, తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా ఇన్‌స్పైర్ ప్రాజెక్ట్



ఎంపికైన ప్రాజెక్టుతో విద్యార్థిని మహాలక్ష్మితిరుపతమ్మ

బాపట్ల అర్బన్: పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని రూపొందించిన ప్రాజెక్ట్ జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైంది. ఇన్‌స్పైర్- 2021-22కు సంబంధించిన ప్రాజెక్టులకు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల స్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించి పోటీల్లో బాపట్ల జిల్లాకు నుంచి ఎనిమిది ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. ఈ నెల 23, 24 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు కాకినాడ జిల్లాలోని విద్యాశాఖ అధికారి కార్యాలయ ఆవరణలో జరిగాయి. ఢిల్లీకి చెందిన నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సహకారంతో జాతీయ స్థాయి ఎంపికలు జరిగాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కర్రి మహాలక్ష్మి తిరుపతమ్మ తయారు చేసిన పోర్టబుల్ మల్టీ అగ్జలరీ కోచ్ పరికరం జాతీయ స్థాయికి ఎంపికై ంది. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు, జిల్లా సైన్స్ అధికారి మహ్మద్ సాధిక్ విద్యార్థిని కర్రి మహాలక్ష్మి తిరుపతమ్మ, గైడ్ ఉపాధ్యాయులు విజయ్‌కుమార్‌ను అభినందించారు. ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని, ఉపాధ్యాయలు హాజరు కానున్నట్లు వెల్లడించారు.

స్పందన అర్జీపై విచారణ

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం శివారు కప్పలవారిపాలెంలో స్పందన అర్జీపై ఎంపీడీఓ కె.పద్మజ శనివారం విచారణ చేపట్టారు. కప్పలవారిపాలెం గ్రామానికి చెందిన పరిశ గంగ కాలిబాటగా ఉన్న స్థలంలో నడిచేందుకు సమీపంలోని వారు అడ్డుకుంటున్నారని, అంతేకాక నడుస్తున్న సమయంలో దుర్భాషలాడుతున్నారని ఈవిషయంపై చందోలు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కోరుతూ స్పందనలో అర్జీ దాఖలు చేశారు. ఈవిషయంపై సంఘటనా స్థలానికి ఎంపీడీఓ పద్మజ, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శి వేమూరి శ్రీనివాసరావులు విచారించారు. ఇద్దరి అన్నదమ్ములకు చెందిన 6 సెంట్ల విస్తీర్ణంలో 3 సెంట్లు చొప్పున విడగొట్టి ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే ఇరువురికి అవసరమైన కాలిబాట నడిచేందుకు ఎవరూ అభ్యంతరం తెలపకూడదని రిజిస్ట్రేషన్ పత్రాలలో కూడా రాసుకున్నారన్నారు. గత కొంతకాలంగా పరిశ గంగ కాలిబాటలో నడుస్తున్న సమయంలో గంగ తోడికోడలు దుర్భాషలాడుతున్నారని ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదికను అందించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.